అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

- నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలకు రూ.211.76 కోట్లు రుణమాఫీ
- 60 వేల మంది మహిళలకు లబ్ధి
- హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సమావేశమైన స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)

నూజివీడు: చంద్రబాబు మోసంతో కుదేలైన స్వయం సహాయక సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంతో తిరిగి జీవం పోశారు. 2014కు ముందు తాను అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తానని చెప్పి అప్పులు కట్టొద్దంటూ ఊరూరా తిరిగి చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత రుణ మాఫీ చేయకుండా నిలువునా ముంచేశాడు. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు స్వయం సహాయక సంఘాలకు చెందిన రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకాన్ని తెచ్చి రుణమాఫీ చేసి ఇచ్చిన హామీని అమలు చేసి చూపించారు. నూజివీడు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి రూ.211.76కోట్లు రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది.

డిఫాల్టర్లుగా మారిన సంఘాలను..

అధికారంలోకి రాగానే రుణాలన్నీ మాఫీ చేస్తానని, ఎవరూ బ్యాంకులకు చెల్లించొద్దంటూ అప్పట్లో చంద్రబాబు చెప్పిన మాయమాటలు నమ్మి అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీ చేస్తాడనే ఉద్దేశంతో సక్రమంగా పొదుపులు కడుతూ, రుణాలను చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు ఒక్కసారిగా చెల్లించడం మానేశారు. దీంతో సంఘాలన్నీ డిఫాల్టర్లుగా మారాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీ చేయకపోవడంతో సంఘాలన్నీ డిఫాల్టర్లుగా మారడంతో వాటికి రుణాన్ని పొందే అర్హతను సైతం కోల్పోయాయి. తిరిగి సంఘాలను గాడిలో పెట్టుకోవడానికి వేలాది రూపాయల అపరాధ వడ్డీని మహిళలు బ్యాంకులకు చెల్లించి తమ సంఘాలను తిరిగి సక్రమంగా మార్చుకున్నారు.

జగన్ సీఎం అయ్యాక..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ నిధులు విడుదల చేసి డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చారు. దీంతో ఈ సంఘాలకు రుణాలు ఏమీ లేకపోవడంతో బ్యాంకులు ఒక్కొక్క గ్రూపునకు రూ.20 లక్షల ఉంచి రూ.25 లక్షల వరకు ఎలాంటి హామీ లేకుండానే లింకేజీ రుణాలను అందిస్తున్నాయి. దీంతో స్వయం సహాయక సంఘాల మహిళలందరూ సంతోషంతో ముందుకు సాగడమే కాకుండా, ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు పలు వ్యాపారాలను సైతం అత్యంత ఉత్సాహంగా చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఆసరా లబ్ధి కోట్లలో..

మండలం	లబ్ధి పొందిన సభ్యులు	లబ్ధి చేకూరిన నగదు రూ.కోట్లలో
ఆగిరిపల్లి	12,734	48,95,48,867
ముసునూరు	12,605	39,37,49,364
చాట్రాయి	11,883	35,37,22,829
నూజివీడు టౌన్	6,788	27,16,58,675
నూజివీడు	15,967	60,89,91,117
	59,977	211,76,70,852

ఇచ్చిన మాట ప్రకారం..



ఎన్నికలప్పుడు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారు. మా గ్రూపునకు రూ.6.80 లక్షలు మాఫీ అయింది. నాకు రూ.68 వేలు మాఫీ కాగా, ఆ డబ్బులు కుటుంబ అవసరాలకు ఉపయోగపడ్డాయి. సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పరనేందుకు ఇంతకంటే రుజువేం కావాలి.

– సగ్గుర్తి శివరావమ్మ, ఆగిరిపల్లి

నాకు ఎంతో మేలు జరిగింది..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది. రుణమాఫీ కింద రూ.68 వేలు వచ్చాయి. సున్నా వడ్డీ కింద రూ.20 వేలు రాగా, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష రుణం తీసుకొని గ్రామంలో జిరాక్స్ షాపు, హోటల్ పెట్టుకున్నాం. వ్యాపారం ద్వారా నెలకు రూ.25 వేలు ఆదాయం వస్తోంది. మా పిల్లలకు అమ్మఒడి వస్తోంది. చేదోడు ద్వారా నాలుగు విడతల్లో రూ.40 వేలు వచ్చాయి.

– దిద్ది భార్గవి, సీతారామపురం, ఆగిరిపల్లి మండలం

క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నం: ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల 25వ వార్షికోత్సవానికి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా మధ్య తరగతి పిల్లలు ఉన్నారని, వారికి పాఠశాలల యాజమాన్యం ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. విద్యా సంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈఓ పుష్పలత పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల పంపిణీకి కృషి

జి.కొండూరు: చెవుటూరులో పేదలకు ఇళ్ల స్థలాలను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు చేపడతామని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. చెవుటూరు గ్రామానికి చెందిన ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మను సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చెవుటూరులో ఇళ్ల స్థలాల పంపిణీకి భూమిని గుర్తించడం ఆలస్యమైన కారణంగా స్థలాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అధికారులు ఇప్పటికే ఐదు ఎకరాల భూమిని సేకరించేందుకు చర్యలు పూర్తిచేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలోనే పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఏపీటీఎఫ్ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడి హైస్కూల్‌లో సోమవారం ఏపీటీఎఫ్ నూజివీడు మండల శాఖ అడ్‌హాక్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల కమిటీ కన్వీనర్‌గా ఎల్‌ఎన్ రాజు (ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్), కో కన్వీనర్‌గా జే విజయరత్న బాబు (పల్లెర్లమూడి హైస్కూల్), సభ్యులుగా జీ రాజభూషణరావు (పల్లెర్లమూడి హైస్కూల్), ఎం.రత్నాకర్ (మీర్జాపురం హైస్కూల్) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, ప్రధాన కార్యదర్శి బీ రెడ్డిదొర, ఏలూరు జిల్లా అధ్యక్షుడు టీ రామారావు తదితరులు హాజరయ్యారు.

రైతుభరోసా అర్హుల జాబితా ప్రదర్శన

తిరువూరు: ప్రభుత్వం మంజూరు చేసే రైతుభరోసా పథకానికి అర్హుల జాబితాలను సోమవారం గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వర్తింపజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 10220 మంది రైతులకు రూ.2 కోట్ల 52 లక్షల 52 వేల 929 నగదు నేరుగా జమచేయనున్నట్లు వ్యవసాయశాఖాధికారులు వెల్లడించారు. తిరువూరు మండలంలో 2445 మంది, ఏకొండూరు మండలంలో 2382 మంది, గంపలగూడెం మండలంలో 3592 మంది, విస్సన్నపేట మండలంలో 1801 మంది రైతులకు రైతుభరోసా పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. ఆంజనేయపురం, మల్లేల, కోకిలంపాడు, లక్ష్మీపురం, మునుకుళ్ల, వావిలాల, రోలుపడి, చింతలపాడు, జీకొత్తూరు, చౌటపల్లి సచివాలయాల్లో రైతులకు ఈ జాబితాలను అందుబాటులో ఉంచారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం(మైలవరం): విద్యార్థి దశ నుంచి పోటీలలో పాల్గొనడం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు ఎమ్.సంధ్యారాణి తెలిపారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్–వికసిత్ రైల్వే–2047 అనే అంశంపై సోమవారం నిర్వహించిన వ్యాస రచన పోటీలో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్.జాహ్నవి ప్రథమ, కే కీర్తన ద్వితీయ, డి.సిద్ధార్థ తృతీయ స్థానాలు సాధించగా వీరిని హెచ్‌ఎం అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో దేశంలో 554 రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో ఒకటిగా రాయనపాడు రైల్వే స్టేషన్ ఎంపిక కావడం సంతోషమన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

చాట్రాయి: ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ హనుమంతరావు స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని చాట్రాయిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందించే పొదుపు, రుణ, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో సైబర్, క్రైమ్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ ట్రాన్సాక్షన్ ద్వారా లావాదేవిలు చేసుకోవాలని సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కౌన్సిలర్ చందు, కౌన్సిలర్ బొల్లికొండ చెన్నారావు, కోల గోపయ్య పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఆర్డీఓ భవాని శంకరి



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని, తప్పనిసరిగా గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానిశంకరి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు స్పందనలో అర్జీలను అందజేస్తున్నారని, ఈ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించడానికి వీలులేకపోతే సంబంధిత కారణాన్ని ఆన్‌లైన్‌లోనే తెలపాలన్నారు. కాగా ఈరోజు స్పందనలో ఆరు అర్జీలు రాగా వాటిని ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారులకు పంపారు. భూములను ఆన్‌లైన్ చేయాలని, ఆక్రమణలు తొలగించాలని, పింఛను మంజూరు చేయాలని తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చారు. స్పందనలో ఏడీఏ విద్యాసాగర్, సీడీపీవో ఎస్వై నూరాని, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీవో సుందరి, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వలస పక్షులను నమ్మొద్దు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ఎన్నికలు రాగానే తిరువూరు నియోజకవర్గంపై వాలిపోయే వలసపక్షులను ప్రజలు నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులోని సూర్యా ఫంక్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ నైసర్గిక స్వరూపం కూడా తెలియనివారు ఎన్నికల్లో పోటీకి వస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న తిరువూరులో ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించే యత్నం చేస్తున్నందున వారిని తిప్పికొట్టాలని కోరారు. సహనంలేని వారు రాజకీయాల్లో ప్రవేశించి ప్రజల్ని ఏమి ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. తాను ఎన్నో చర్చావేదికలపై పాల్గొన్నాననీ, ఎవరినీ చెప్పులతో కొట్టలేదని స్వామిదాసు పేర్కొన్నారు. ప్రజలకు వినోదాన్ని పంచే దర్శకుల తల తీస్తే కోట్లు ఇస్తామంటూ అసహనంతో వ్యాఖ్యలు చేసే వ్యక్తులు తిరువూరుకు అవసరమా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుతో ఇటువంటి వ్యక్తులకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వారియర్స్ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, సోషల్ మీడియా ప్రతినిధులు గోపీ, రేగళ్ళ మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

ఆగిరిపల్లి: స్థానిక పోతవరప్పాడులోని ఎస్ఆర్ఐ కళాశాల విద్యార్థులు సోమవారం కనసానపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి నీటిని ఎలా పొదుపు చేసుకోవాలి, సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రూ.12.13 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కల్యాణి, తదితరులు

విజయవాడరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో ఒకటైన రాయనపాడు రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.12.13 కోట్ల అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ కాటంనేని కల్యాణి, రైల్వే శాఖ అధికారులు సోమవారం శంకుస్థాపన చేశారు. రాయనపాడు రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల తీర్చేందుకు అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా రాయనపాడు స్టేషన్ ఎంపిక చేయడం అదృష్టమని సర్పంచ్ కల్యాణి ఈ సందర్భంగా అన్నారు. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ఆమె అధికారులను కోరారు. దినదినాభివృద్ధి చెందుతున్న రైల్వే కూడలిగా రూపుదిద్దుకున్న ఈ స్టేషన్‌ను రాయనపాడు ప్రజల సౌకర్యార్థం అమృత్ భారత్ స్కీం కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు రాయనపాడు రైల్వే స్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం, ప్రయాణ ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పూర్తిగా అభివృద్ధి చేయబడిన తరువాత ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా రూపాంతరం చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కాటంనేని పూర్ణచంద్రరావు, మైలవరం నియోజకవర్గం బీజేపీ ప్రతినిధి నూతలపాటి బాలకోటేశ్వరరావు, వీఆర్వో చంద్రశేఖర్‌శర్మ, గ్రామ కార్యదర్శి స్వరూపరాణి పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి అధికారులు, ప్రజా ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణతో మేలు



పశుపోషకులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

ఇబ్రహీంపట్నం(మైలవరం): పశువుల్లో కృత్రిమ గర్భధారణ రైతులకు లాభదాయకమని పశుగణాభివృద్ధి జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి పశువుల ఆసుపత్రిలో లేగ దూడల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంలో రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని రైతులకు సూచించారు. లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. నాలుగు సంవత్సరాల్లో పాల ఉత్పత్తి రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. దీనితో పశుపోషణ లాభదాయకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజకుమారి, వాసు పాల్గొని లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు కాటూరి వెంకటేశ్వరరావు, కే రాధకృష్ణమూర్తి, కృష్ణమూర్తి, ఇబ్రహీంపట్నం, నందిగామ గ్రామాల పశువైద్యులు స్వాతి అయ్యప్ప, శైలు మాధురి, మోహన్ కిశోర్, ఇబ్రహీంపట్నం పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ స్థాయిని పెంచిన ప్రభుత్వం



చిన్నంపేట జెడ్పీ హైస్కూలు

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట జిల్లాపరిషత్ హైస్కూల్‌ను జూనియర్ కాలేజీ స్థాయికి ప్రభుత్వం పెంచింది. మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా చిన్నంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ని జూనియర్ (కో ఎడ్యుకేషన్)కాలేజీగా ఎంపిక చేసింది. ఈ హైస్కూల్ పరిధిలో చీపురుగూడెం, మర్రిబంధం, కోటపాడు, చిన్నంపేట, పర్వతాపురం గ్రామాల నుంచి విద్యార్థులు 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో కాలేజీకి వెళ్లాలంటే చాట్రాయి, విస్సన్నపేట వెళ్లాల్సి వస్తుంది. ఇతర గ్రామాల్లో విద్యార్థులకు ఇంటర్ చదువులకు అనువుగా ఉండడంతో ప్రభుత్వం ఈ హైస్కూల్‌ని ఎంపిక చేసింది. ఈ కాలేజీలో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. కాలేజీ ఏర్పాటుపై హర్షం వ్యక్తం అవుతోంది. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ కాలేజీలో క్లాసులు ప్రారంభం అవుతాయని, బాలబాలికలకు ప్రవేశం ఉందని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు.

పథకాల అమలు తీరు పరిశీలన

నూజివీడు: మండలంలో ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ప్రోగ్రామ్ మేనేజర్ కే జయరామ్ సోమవారం పరిశీలించారు. నూజివీడులోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయాన్ని సోమవారం సందర్శించి మండల సమైఖ్య పాలకవర్గం సభ్యులతో చర్చించారు. స్వయం సహాయక సంఘాలు ప్రతి నెలా సమావేశాల్లో చర్చించుకుంటే సంఘాలు బలోపేతమవుతాయని జయరామ్ అన్నారు. రుణాల రికవరీ వంద శాతం ఉండాలన్నారు. స్థానిక మహిళా మార్ట్‌ను సందర్శించి క్రయ, విక్రయాలను సమీక్షించారు. మొర్సపూడిలో స్పందన గ్రామైఖ్య సంఘం సమావేశంలో పాల్గొన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ ఎం.మహిత, ఏపీఎం దయాల రాజశేఖర్, లీగల్ కో ఆర్డినేటర్ ప్రసాద్ , మండల సమైక్య అధ్యక్షురాలు నవత పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

ముసునూరు: అక్రమ సారా తయారీ బట్టీలపై దాడులు చేసినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. సోమవారం వేల్పుచర్ల గ్రామ శివార్లలోని ఓ తోటలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 1,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, 30 లీటర్ల సారా సీజ్ చేసినట్లు చెప్పారు. తయారీదారుడు జోగి లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

విస్సన్నపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ ఎస్.మురళీమోహన్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను, సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రతిపాదనలపై నిరసన



నిరసన ప్రదర్శనలో రైతు సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు

మైలవరం: ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ ఆంజనేయులు అన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలపై నిరసనగా స్థానిక ప్రధాన రహదారిలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశం దోహా నగరంలో జరిగిందని ఆయన తెలిపారు. సమావేశంలో రూపొందించిన ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఈ ప్రతిపాదనలు సూచిస్తున్నాయని దుయ్యబట్టారు. రైతు కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరను రద్దు చేయాలని, వివిధ దేశాల ప్రభుత్వాలను డబ్ల్యూటీఓ ఆదేశిస్తుందని అలాంటి ఆదేశాల్ని భారత దేశం వంటి వ్యవసాయం మీద ఆధారపడినటువంటి దేశాలు తిరస్కరించాలని సూచించారు. గత కొన్ని రోజులుగా హార్యానాలో జరుగుతున్న రైతు ఉద్యమంలో ఐదుగురు రైతులు ప్రాణాలను కోల్పోయారని, దీనికి కారణమైన హర్యానా ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సోమనాథ్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు ఉద్యమంలో మృతి చెందిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని, అదే విధంగా 50 సంవత్సరాలు పైబడిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, రైతు సంఘం నాయకులు, పలు అసోసియేషన్‌ల నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: రైతులకు, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే డబ్ల్యూటీఓ ఒప్పందాల నుంచి భారత దేశం తక్షణమే తప్పుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఐక్యవేదిక దేశవ్యాప్త పిలుపులో భాగంగా నూజివీడులోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో సోమవారం సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ వై భవానిశంకరికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ కార్యదర్శి జి.రాజు, రైతు సంఘం నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్‌మోహన్‌రావు, పీఏసీఎస్ మాజీ కార్యదర్శి ఒగ్గు బెనర్జీ, సీఐటీయూ నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: డబ్ల్యూటీఓ ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్ డిమాండ్ చేశారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై కేంద్ర కార్మిక, రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా కౌలు సంఘాల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న డబ్ల్యూటీఓ ఒప్పందాల వల్ల రైతులు వ్యవసాయాన్ని దివాలా తీసే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. రైతు, కార్మిక సంఘం నాయకులు ఏ అమ్మిరెడ్డి, టీ సురేష్, పి ఆనందరావు, వెంకటేశ్వరరావు, షేక్ కరిముల్లా, సోములు పలువురు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



నూజివీడు: విద్యార్థులు పోటీతత్వం, పోరాట పటిమ, ఓటమిని తట్టుకునే శక్తి అలవర్చుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో డిపార్ట్‌మెంట్ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) క్రికెట్ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపడుతున్న విద్యార్థులకు క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌కు మొత్తం ఏడు టీంలు నమోదు చేసుకున్నాయి. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ (బాలురు) ఏ బ్రహ్మస్వాములు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు నవీన్‌కుమార్, సూర్య, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించండి

నూజివీడు: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ఆర్డీఓ వై.భవానీశంకరి సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎన్నికలకు సంబంధించి సెక్టోరియల్ అధికారులకు, పోలీస్ అధికారులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉన్నతాధికారులు అడిగే నివేదికలను సకాలంలో పంపాలని, పదేపదే అడిగించుకోవద్దన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే, చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్లను భౌతికంగా పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలను, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్ల వివరాలను, రౌడీషీటర్ల వివరాలను తెలపాలన్నారు. రాజకీయ పక్షాలు ఆరోపణలు చేసేందుకు తావివ్వొద్దన్నారు. పలు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన



ఆగిరిపల్లి: హెచ్‌ఐవీ నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సగ్గురులో సోమవారం కళాజాత బృందం వీధి నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం, క్షయ వ్యాధినివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అర్థమయ్యేలా పాటలు, నాటికల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు శేఖర్ బాబు, వీరయ్య, రవితేజ, చిరంజీవి, ప్రసాద్, కుమార్, పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో ఎయిడ్స్ నియంత్రణపై సోమవారం కళాజాతా నిర్వహించారు. రక్త పరీక్షల్లో ఎయిడ్స్ అని నిర్ధారణ కలిగితే సీడీ ఫోర్ కౌంట్‌తో సంబంధం లేకుండా ఏఆర్టీ మందులు వాడాలని సూచించారు. అనంతరం క్షయ, ఎయిడ్స్ వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. కళాకారులు ఎం.ప్రసాదు, ఎం.తిరుపతి, ఎం.నాగేంద్ర, ఎం.విజయకుమార్, వై. రాము, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో ఎవరూ చేరలేదు



తాతకుంట్ల (విస్సన్నపేట) : తాతకుంట్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నుంచి జనసేన పార్టీలో సుమారు వంద మంది చేరినట్లు కొన్ని పత్రికలలో, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం అవాస్తవమని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ కాలేషా తెలిపారు. సోమవారం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నుంచి జనసేన పార్టీలో ఎవరూ చేరలేదని, టీడీపీ వారిని, గ్రామంలో ఓట్లు లేని కొంతమంది యువకులకు జనసేన పార్టీ కండువాలు కప్పి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సర్పంచ్ ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

ముసునూరు: మండలంలో రెండో విడత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, నోడల్ అధికారి సీహెచ్.పద్మావతిదేవి, వైద్యాధికారి కరీముల్లా తెలిపారు. ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు అవినాష్, షకీనా ఇవాంజిలిన్, భవాని, మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేస్తారు.